క్లుప్తంగా

నేడు సర్వసభ్య సమావేశం

పి.గన్నవరం: స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం ఉదయం 10.30 గంటలకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ కేవీ ప్రసాద్ తెలిపారు. ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి అధ్యక్షతన జరిగే సమావేశంలో మండలంలోని ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

నిత్యాన్నదానానికి విరాళం

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి భద్రాచలంకు చెందిన పరిటాల మిహిరా శ్రీసాయి అక్షజ్ఞాలు రూ.10,001, అమలాపురానికి చెందిన వంటెద్దు నారాయణస్వామి రూ.10,116లు విరాళంగా శుక్రవారం అందజేశారు. ఈ సొమ్మును దాతలు ఆలయ ప్రధానార్చకుడు మాచరి వినాయకరావుకు అందజేశారు. దాతలను సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. దాతను ఆలయ అర్చకులు, ఆలయ సిబ్బంది గ్రామస్తులు అభినందించారు.

ప్రకృతి వైపరీత్యాలపై అవగాహన కార్యక్రమం

సఖినేటిపల్లి: మండల కేంద్రం సఖినేటిపల్లి పంచాయతీ వద్ద శుక్రవారం ఎన్డీఆర్ఎఫ్ ఆధ్వర్యంలో గ్రామస్తులకు ప్రకృతి వైపరీత్యాలపై కమ్యూనిటీ అవేర్‌నెస్ ప్రోగ్రాం ఏర్పాటు చేశారు. పదో ఎన్డీఆర్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ భూపేంద్ర కుమార్ సారథ్యంలో టీం సభ్యులు అవేర్‌నెస్ ప్రోగ్రాం నిర్వహించారు. మండల రెవెన్యూ, పోలీసు, ఫైర్ శాఖల సిబ్బంది పాల్గొన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ ఎం.వెంకటేశ్వరరావు రెవెన్యూ డే పురస్కరించుకుని గ్రామ సభ నిర్వహించారు. సభలో రిటైర్డ్ రెవెన్యూ ఎంప్లాయీస్‌ను ఆయన సత్కరించారు. కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు, వీఆర్ఏలు, రేషన్‌షాప్ డీలర్స్ పాల్గొన్నారు.

వెబ్‌ల్యాండ్ భూముల విభజనకు అనుమతి

ఆలమూరు: భూముల రీ–సర్వే పూర్తయిన గ్రామాల్లో వెబ్ ల్యాండ్ 2.0లో జాయింట్ పట్టాదారులుగా నమోదైన రైతుల భూముల విభజన చేయడానికి ప్రభుత్వం వెసులుబాటు కల్పించిందని మండల సర్వేయర్ బొబ్బా ప్రభావతి తెలిపారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ రీ సర్వే పూర్తయిన వెబ్ ల్యాండ్ 2.0లో జాయింట్ పట్టాదారులుగా నమోదైన భూ యజమానులు భూ విభజన నిమిత్తం ఈనెల 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గతంలో నిర్దేశించిన రూ.500గా రుసుముకు మినహాయింపు లభించిందన్నారు. స్థానిక గ్రామ సచివాలయంలో కేవలం రూ.50 చెల్లించి, ఈనెల 30 లోగా దరఖాస్తు చేసుకోవాలని వారు సూచించారు. రుసుము మినహాయింపు ఈ నెలాఖరు వరకు మాత్రమే వర్తిస్తుందని తెలిపారు. జాయింట్ పట్టాదారు రైతులందరూ ఈఅవకాశాన్ని తమ పట్టాలను విడివిడిగా విభజన చేయించుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీని వల్ల ప్రభుత్వం త్వరలో అమలు చేయనున్న అన్నదాతా సుఖీభవ, తల్లికి వందనం పథకానికి అర్హత లభిస్తుందని ఆమె పేర్కొన్నారు.

అందరికీ పౌష్టికాహారం అందించాలి

అంబాజీపేట: అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే చిన్నారులు, గర్భిణులు, బాలింతలందరికీ పౌష్టికాహారం సక్రమంగా అందించాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. గంగలకుర్రు అగ్రహారం ప్రసాద్‌నగర్ కాలనీలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం ఎంపీపీ వెంకటేశ్వరరావుతో పాటు వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్ పరిశీలించారు. ఈ సమయంలో అంగన్‌వాడీ టీచర్ విధుల్లో లేకుండా అంగన్‌వాడీ ఆన్‌లైన్ నిమిత్తం ఇతర కేంద్రానికి వెళ్లినట్లు ఆయా తెలిపారు. అంగన్‌వాడీ టీచర్ విధులకు సక్రమంగా హాజరుకాకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, పౌష్టికాహార పంపిణీ సక్రమంగా జరగడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. అంగన్‌వాడీ కేంద్రం వద్ద కొంత మంది ఆకతాయిలు మద్యం తాగి గ్లాసులు, సీసాలను అక్కడే పాడేస్తున్నారని ఆయా ఎంపీపీ దృష్టికి తీసుకుచ్చారు. అనంతరం చిన్నారుల తల్లిదండ్రులకు బాలామృతం, పౌష్టికాహారాన్ని అందజేశారు.

నేలకొరిగిన తాడిచెట్టు



పేర్మాయిపాలెంలో నేలకొరిగిన తాడిచెట్టు

అంబాజీపేట: గంగలకుర్రు అగ్రహారం శివారు పేర్మాయిపాలెం హెచ్‌పీ పెట్రోల్ బంక్ సమీపంలో ప్రధాన రహదారిపై తాడిచెట్టు నేలకొరిగింది. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిలో తాడిచెట్టు నేలకొరిగే సమయంలో ఎవరూ లేకపోవడంతో ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో స్థానికులు, ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రధాన రహదారిపై తాడిచెట్టు అడ్డంగా పడి ఉండటంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. ద్విచక్ర, త్రిచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

యువత పోరును విజయవంతం చేద్దాం

మాజీ మంత్రి గొల్లపల్లి



యువత పోరుపై నియోజకవర్గ విద్యార్థి సంఘ నాయకులతో సమావేశమైన కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు

మలికిపురం: ఈనెల 23వ తేదీ సోమవారం జిల్లా కేంద్రం అమలాపురంలో కలెక్టర్ కార్యాలయాల వద్ద వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు నిర్వహించే యువత పోరు కార్యక్రమం విజయవంతం చేద్దామని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. శుక్రవారం మలికిపురంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు గుర్రం జాషువా అధ్యక్షతన జరిగిన యువత పోరు సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా కూటమి ప్రభుత్వంలో విద్యార్థులు, నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలకు మద్దతుగా మాజీ సీఎం జగన్ ఈ కార్యక్రమం చేపట్టినట్లు సూర్యారావు అన్నారు. ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం నిరుద్యోగులకు, యువతకు ఉద్యోగం, ఉపాధి కల్పించడంతో పూర్తిగా విఫలమయిందన్నారు. జీవనోపాధి లేక యువత తీవ్ర ఇబ్బందులు పడుతుందన్నారు. స్కిల్ డెవలప్ చేయడంలో కూడా శ్రద్ధ లేదని సూర్యారావు విమర్శించారు. కనీసం నిరుద్యోగ భృతి కూడా ఇవ్వకుండా సీఎం చంద్రబాబు యువతను మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ప్రజలకు తెలియజేసి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు యువత పోరు నిరసన కార్యక్రమం చేపట్టినట్లు సూర్యారావు అన్నారు. పార్టీ యువన విభాగం విద్యార్థి విభాగం నాయకుడు పెద్ద ఎత్తున కార్యక్రమంలో పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో యువజన విభాగం అధ్యక్షుడు గుర్రం జాషువా మాట్లాడుతూ ప్రతిష్టాత్మకంగా జరిగే ఈ నిరసనకు భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. పార్టీ నాయకులు పాటి శివకుమార్, కుసుమ చంద్రశేఖర్, చెల్లింగి నవీన్, తాడి సహదేవ్, వాసంశెట్టి శ్రీహరి, కొల్లాబత్తుల మున్నా, గేదెల చిట్టిబాబు, కొప్పిశెట్టి రాము, ఉచ్చుల మోహన్ పాల్గొన్నారు.

తొత్తరమూడిలో..

అయినవిల్లి: వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రీజనల్ కో ఆర్డినేటర్ బొత్స సత్యనారాయణ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి సూచనల మేరకు ఈ నెల 23న 'యువత పోరు' పేరుతో యువజన విభాగం ఆధ్వర్యంలో నిర్వహించనున్న కార్యక్రమాన్ని విజయవంతం చేయాలనని పి.గన్నవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు శుక్రవారం తొత్తరమూడిలోని కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు ఇంటి వద్ద నియోజకవర్గ యూత్ కనీ్వనర్లు, విద్యార్థి సంఘ నాయకులతో సమావేశమయ్యారు. జూన్ 23న ఉదయం 9 గంటలకు అమలాపురంలో బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం, వినతిపత్రం సమర్పిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు, నియోజకవర్గ విద్యార్థి విభాగం అధ్యక్షుడు, నాలుగు మండలాల విద్యార్థి విభాగం అధ్యక్షుడు, యువజన విభాగం విద్యార్థి విభాగం భారీ ఎత్తున యువతను, అనుబంధ విభాగాలను, విద్యార్థులు, పార్టీ నాయకులు, భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో నియోకవర్గ యూత్ అధ్యక్షుడు నెల్లి దుర్గాప్రసాద్, నాలుగు మండలాల యూత్ అధ్యక్షులు కుసుమ వెంకటరమణ, సుదాబత్తుల రాము, మట్టపర్తి సోమశేఖర్, మట్టపర్తి శివ, జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు మిండగుదిటి శిరీష్, నాలుగు మండలాల విద్యార్థి విభాగం అధ్యక్షులు బొక్క మురళీకృష్ణ, దేవరపల్లి గౌతమ్, కొండేటి సురేష్, ఉంద్రు వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు అవార్డులు



కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు తీసుకుంటున్న డీటీ సుబ్బరాజు, తహసీల్దార్లు ముక్తేశ్వరరావు, వెంకటేశ్వరరావు, ఆర్ఐ రామరాజు, వీఆర్వో సీతారామం

సఖినేటిపల్లి: ప్రజలకు ఉత్తమ సేవలు అందించినందుకుగాను జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ చేతుల మీదుగా తహసీల్దారు ఎం.వెంకటేశ్వరరావు, మండల ఆర్ఐ వి.రామరాజు, వీఆర్వో బొల్లాప్రగడ సీతారామం శుక్రవారం అవార్డులు అందుకున్నారు. ఈ మేరకు అమలాపురం కలెక్టరేట్‌లో జరిగిన రెవెన్యూ డే పురస్కరించుకుని పై అవార్డుల ప్రదానం జరిగింది.

డీటీ సుబ్బరాజుకు జిల్లా ఉత్తమ అవార్డు

ఆలమూరు: స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న టి.సుబ్బరాజుకు జిల్లా ఉత్తమ సేవ అవార్డు లభించింది. ఈ మేరకు శుక్రవారం అమలాపురంలోని జిల్లా కేంద్ర కార్యాలయంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్, జాయింట్ కలెక్టర్ నిశాంతి చేతుల మీదుగా ఆయన అవార్డు అందుకున్నారు. అలాగే నవాబుపేట వీఆర్వోగా పనిచేస్తున్న జి.రామకృష్ణ కూడా ఉత్తమ సేవ అవార్డు అందుకున్నారు. విధి నిర్వహణలో అత్యుత్తమ సేవలను అందించినందుకుగాను ఈ అవార్డులు వరించినట్లు తహసీల్దార్ కేజే ప్రకాష్‌బాబు తెలిపారు. ఎంపీడీఓ ఎ.రాజు, సర్వేయర్ ప్రభావతి, మండల రెవెన్యూ అధికారులు అభినందనలు తెలియజేశారు.



పి.గన్నవరంలో విశ్రాంత రెవెన్యూ ఉద్యోగిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

ఉత్తమ అవార్డు అందుకున్న ముక్తేశ్వరరావు

రావులపాలెం: రెవెన్యూ దినోత్సవాన్ని పురస్కరించుకుని అమలాపురంలో జరిగిన కార్యక్రమంలో రావులపాలెం తహసీల్దార్ బీఎం ముక్తేశ్వరరావు ఉత్తమ తహసీల్దార్ అవార్డు అందుకున్నారు. జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు ప్రశంసా పత్రం అందుకున్నట్టు తహసీల్దార్ శుక్రవారం తెలిపారు. అలాగే మండల పరిధిలోని వీఆర్వో లక్ష్మీపతి, శైలజ జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందుకున్నట్టు ఆయన తెలిపారు.

మెరుగైన సేవలు అందించాలి

పి.గన్నవరం: రెవెన్యూ ఉద్యోగులు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ పి.శ్రీపల్లవి ఆధ్వర్యంలో శుక్రవారం రెవెన్యూ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విశ్రాంత రెవెన్యూ ఉద్యోగులను ఎమ్మెల్యే దుశ్శాలువాతో సత్కరించారు. డిప్యూటీ తహసీల్దార్ ఎం.సత్యనారాయణ, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వెన్నపు డాంగే, వీఆర్వోలు, వీఆర్ఏలు, విలేజ్ సర్వెంట్లు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

అంబాజీపేటలో..

అంబాజీపేట: మండల కేంద్రంలో నిర్వహిస్తున్న రెవెన్యూ సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని డీటీ సీహెచ్‌వెంకటేశ్వరరావు అన్నారు. అంబాజీపేట మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద రెవెన్యూ దినోత్సవ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ రెవెన్యూ సేవలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉంటే వారి సమస్యలు సత్వరమే పరిష్కారమవుతాయన్నారు. రెవెన్యూ పరిధిలోని సమస్యలుంటే కార్యాలయంలో సంప్రదిస్తే తక్షణమే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ కె.ఏడుకొండలు, సర్వేయర్లు, వీఆర్వోలు, వీఆర్ఏలు, రైతులు పాల్గొన్నారు.

ఈఏపీ సెట్ ర్యాంకర్‌కు అభినందన



ఆలమూరులో ఈఏపీసెట్ ర్యాంకర్ అమృతను ఘనంగా సత్కరిస్తున్న యాజమాన్య, అధ్యాపక బృందం

ఆలమూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ విద్యను అభ్యసించి ఇటీవల విడుదలైన ఫలితాల్లో 914 మార్కులతో పాటు, ఏపీఈఏపీసెట్‌లో 11,776 ర్యాంకు సాధించిన వాకా అమృతను యాజమాన్యం, అధ్యాపక బృందం అభినందించింది. స్థానిక కళాశాల ఆవరణలో ప్రిన్సిపాల్ నల్లమిల్లి సురేష్‌రెడ్డి నేతృత్వంలో ఆలమూరు ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ వైస్ చైర్మన్ గుణ్ణం వీర్రాజు, సంయుక్త కార్యదర్శి గారపాటి త్రిమూర్తులు చేతుల మీదుగా విద్యార్థిని అమృతకు దుశ్శాలువా కప్పి, మెమొంటో బహూకరించి బహుమతులు అందించి అభినందనలు తెలియజేశారు. ప్రభుత్వ కళాశాలలో విద్యాభ్యాసం చేసి కార్పొరేట్ కళాశాలతో సమానంగా అత్యుత్తమ ర్యాంకు సాధించడం అభినందనీయమని కొనియాడారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నైపుణ్యం కలిగిన అధ్యాపకులు అందుబాటులో ఉండటంతో పాటు విద్యార్థులందరికి ఉచిత విద్య, పుస్తకాలు, మధ్యాహ్న భోజనం అందుబాటులో ఉందని యాజమాన్యం తెలియజేసింది. పరిసర గ్రామాల తల్లిదండ్రులు తమ పిల్లలను ఈ కళాశాలలో చేర్పి ఇక్కడ లభిస్తున్న సౌకర్యాలను అందిపుచ్చుకోవాలని ప్రిన్సిపాల్ సురేష్‌రెడ్డి ఈ సందర్భంగా కోరారు.

యోగాంధ్ర దెబ్బకు బస్టాండ్ ఖాళీ !

- 80 శాతం బస్సులు విశాఖపట్నానికి తరలింపు
- ఈసురోమన్న ప్రయాణికులు



బస్సుల కోసం రావులపాలెం బస్టాండ్లో ఎదురుచూస్తున్న ప్రయాణికులు

రావులపాలెం: రాష్ట్ర ప్రభుత్వం విశాఖపట్నంలో నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమానికి అధిక శాతంలో ఆర్టీసీ బస్సులు విశాఖపట్నం పంపడంతో శుక్రవారం స్థానిక బస్టాండ్లో బస్సులు లేక ప్రయాణికులు అవస్థలు పడ్డారు. ఎటువంటి ముందస్తు ప్రకటనలు లేకుండా డిపో పరిధిలోని ఉన్న సుమారు 75 బస్సుల్లో 41 బస్సులు వైజాగ్ పంపడంతో మిగిలిన బస్సులు అరకొరగా సర్వీసులు అందించడంతో ప్రయాణికులు నానా అగచాట్లు పడ్డారు. గంటలు తరబడి బస్టాండ్లో బస్సుల కోసం పడిగాపులు పడాల్సి వచ్చింది. ఇదిలా ఉంటే శుక్రవారం పంపిన బస్సులు శనివారం సాయంత్రానికి కానీ రావులపాలెం వచ్చే అవకాశం లేకపోవడంతో ప్రతి శనివారం కోనసీమ తిరుపతిగా పేరుగాంచిన వాడపల్లి వెంకటేశ్వర స్వామి దేవస్థానానికి వచ్చే వేలాది భక్తులు బస్సులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఉంది. శుక్రవారం రోజునే బస్సుల కోసం పడిగాపులు పడిన ప్రయాణికులు శనివారం వచ్చే ప్రయాణికులకు ఎటువంటి ప్రత్యామ్నాయం ఆర్టీసీ చేయకపోవడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి



రెవెన్యూ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న తహసీల్దార్ ముక్తేశ్వరరావు తదితరులు

అయినవిల్లి: ముక్తేశ్వరంలోని వాసవీ ఆర్యవైశ్య కల్యాణ మండపంలో రెవెన్యూ దినోత్సవాన్ని జరిపారు. తహసీల్దార్ విద్యాపతి మాట్లాడుతూ ఈ వ్యవస్థలో ప్రజల న్యాయం కోసమే రెవెన్యూ అధికారులు తమ జీవితాలను అంకితం చేసినట్లు గుర్తు చేశారు. ఇటు వంటి వ్యవస్థ ద్వారా ప్రజలు అనేక సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీటీ డి.శ్రీనివాస్, రీసర్వే డీటీ స్వర్ణ, ఆర్ఐ ఎంఎంఎస్ రాయుడు, డిప్యూటీ సర్వేయర్ కోల ఉమాదేవి రెవెన్యూ అధికారులు, వివిధ పార్టీల నాయకులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

రావులపాలెంలో..

రావులపాలెం: స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో తహసీల్దార్ బీఎం ముక్తేశ్వరరావు ఆధ్వర్యంలో రెవెన్యూ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మాజీ తహసీల్దార్ కొప్పిశెట్టి దుర్గారావు, మాజీ ఉప తహసీల్దార్ తనికెళ్ల శివానంద్‌లను ఘనంగా సన్మానించారు. అనంతరం పలువురు రెవెన్యూ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు, జక్కంపూడి వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

యోగా డేను విజయవంతం చేయాలి



పప్పులవారిపాలెంలో యోగాసనాలు వేస్తున్న మహిళలు



విశ్వేశ్వరాయపురంలో ఆకట్టుకున్న యోగా అక్షరాల ముద్ర

ఆలమూరు/పి.గన్నవరం/సఖినేటిపల్లి/మలికిపురం/రాజోలు/పి.గన్నవరం/కొత్తపేట/అంబాజీపేట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పిలుపు మేరకు ఈనెల 21న శనివారం నిర్వహిస్తున్న యోగా డేను విజయవంతం చేయాలని ఎంపీడీఓ ఎ.రాజు కోరారు. యోగాలో శిక్షణ పొందిన అభ్యాసకులంతా ప్రపంచ యోగా దినోత్సవానికి తరలి వెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. పి.గన్నవరం మండలంలోని పప్పులవారిపాలెంలో యోగా గురువు శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళలు, గ్రామస్తులతో యోగాసనాలు వేయించారు. యోగా ప్రాముఖ్యతను వివరించి, ప్రతీ ఒక్కరూ యోగా చేయాలని సూచించారు. సఖినేటిపల్లి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ కె.సూర్యనారాయణ అధ్యక్షతన ఆయా శాఖలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడుతూ, అన్ని గ్రామ సచివాలయాల పరిధిలలో ఏర్పాటు చేసిన 189 వేదికల వద్ద యోగా డే విజయవంతం చేసే విధంగా ఏర్పాట్లు చూడాలన్నారు. మలికిపురం భాష్యం స్కూల్ హైస్కూల్‌లో ఘనంగా యోగా డే నిర్వహించారు. రోజువారీ జీవితంలో యోగాను ఒక భాగంగా చేసుకోవాలని అన్నారు. అలాగే విశ్వేశ్వరాయపురం వివేకానంద పాఠశాల విద్యార్థులు యోగా అక్షరాల ఆకారంలో వేసి ముద్ర ఆకట్టుకుంది. రాజోలు మండలం కడలి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు యోగాపై అవగాహన కల్పించారు. యోగాసనాలు వేయడం ద్వారా ఒత్తిడి దూరమవుతుందన్నారు. యోగా గురువు చంద్రశేఖర్‌ను ఘనంగా సత్కరించారు. పి.గన్నవరం మండలం మానేపల్లిలో గ్రామ సర్పంచ్ కుసుమ చంద్రకళ శుక్రవారం జరిగిన యోగా శిక్షణలో పాల్గొన్నారు. యోగా ప్రాముఖ్యతను ఆమె వివరించారు. కొత్తపేట మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలో యోగాంధ్ర 2025 కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ పీఎస్ నరేష్‌కుమార్ మండల, గ్రామ స్థాయి అధికారులకు, సిబ్బందికి సూచించారు. సచివాలయాల పరిధిలో గుర్తించిన 180 పైగా వేదికల వద్ద యోగా కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించడానికి అందరూ సమాయత్తం కావాలని మొత్తం 10 గ్రామ పంచాయతీల్లో ఈ కార్యక్రమాన్ని మానిటర్ చేయడానికి 10 మంది సూపర్‌వైజరీ అధికారులను నియమించామన్నారు. సమావేశంలో ఎంఈఓలు మట్టపర్తి హరిప్రసాద్, కె.లీలావతి, ఈఓ పీఆర్డీ డి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. అంబాజీపేట మండల పరిషత్ కార్యాలయంలో పరిశీలకులకు అవగాహన సమావేశాన్ని నియోజకవర్గం ప్రత్యేకధికారి, కె.ఆర్.సి సబ్ కలెక్టర్ కె.మూర్తి నిర్వహించారు. కార్యక్రమంలో ఇంచార్జి ఎంపీడీఓ గిడ్ల భీమారావు, ఎఫ్ఏసీ తహసీల్దార్ చిన బాబు, మండల పరిషత్ పరిపాలనాధికారి ఎ.నరసింహారావు, డిప్యూటీ తహశీల్దార్ సీహెచ్. వెంకటేశ్వర రావు, అధికారులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఎంతో మేలు

మామిడికుదురు: ప్రకృతి వ్యవసాయాన్ని ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని దాని వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని జిల్లా వ్యవసాయాధికారి బోసు బాబు తెలిపారు. ఆయన ఈదరాడలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను శుక్రవారం పరిశీలించారు. ఇటీవల ప్రకృతి వ్యవసాయం సాగు గణనీయంగా పెరిగిందన్నారు. దీని వల్ల తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు సాధించే అవకాశం ఉందన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేసిన పంటలకు మార్కెట్‌లో డిమాండ్ ఎక్కువగా ఉందని చెప్పారు. ప్రకృతి వ్యవసాయంలో పండించిన ఉత్పత్తుల వినియోగం వల్ల ఎటువంటి అనారోగ్య సమస్యలు ఏర్పడవన్నారు. సహజ సిద్ధంగా లభ్యమయ్యే వాటితో ఎరువులు, పురుగు మందులు తయారు చేసి వాటితోనే పంటలను సాగు చేస్తున్నారని చెప్పారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కూడా ఎంతో ప్రాధాన్యం ఇస్తుందన్నారు. ఆయన వెంట ప్రకృతి వ్యవసాయం సాగు చేస్తున్న కుడుపూడి జానకి, చెల్లుబోయిన రాధ, గోగి లెనిన్, స్థానిక రైతులు ఉన్నారు.

శానపల్లిలంక వద్ద రైల్వే లైన్ పరిశీలన



రైల్వేలైన్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, ఎంపీ

అయినవిల్లి: మండలంలోని శానపల్లిలంకలో జరిగిన కోనసీమ రైల్వే లైన్ పనులను స్థానిక ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాథుర్ శుక్రవారం పరిశీలించారు. ఎమ్మెల్యే, ఎంపీ రైల్వే లైన్ కోసం భూములు ఇచ్చిన రైతులతో సమావేశమయ్యారు. రైతులకు ఇవ్వాల్సిన పరిహారంపై న్యాయం చేస్తామన్నారు. రైల్వే లైన్ పనులు పూర్తి చేసేందుకు తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. రైల్వే లైన్ కోసం కోనసీమలో ఉన్న గోదావరి, వైనతేయ నదుల్లో దాదాపుగా పిల్లర్స్ పనులు పూర్తయ్యాయన్నారు. ఈ పిల్లర్లపై నిర్మించే సూపర్‌స్ట్రక్షర్ నిర్మాణానికి రైల్వే శాఖ టెండర్ పిలిచిందన్నారు. కాంట్రాక్టు అవార్డు కూడా ఖరారు చేసినట్లు తెలిపారు. రైల్వే లైన్ పనులు చేసేందుకు ఉన్న అడ్డంకులు తొలగించేందుకు దృష్టి సారించామని ఎంపీ హరీష్‌మాథుర్ వివరించారు. ఎమ్మెల్యే, ఎంపీలను రైతులు సత్కరించారు. భూ సేకరణకు ఉన్న అడ్డంకులను ప్రక్రియ కూడా పూర్తి చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. రైల్వే పనులు పూర్తి చేయడానికి రెవెన్యూ అధికారుల పూర్తి సహకారం చేస్తారని అలాగే తన వైపు నుంచి కూడా పూర్తి సహకారం ఉంటుందని రైల్వే శాఖ అధికారులకు ఎంపీ వివరించారు. సమావేశంలో సౌత్ సెంట్రల్ రైల్వే డిప్యూటీ చీఫ్ ఇంజినీర్ ఎ.బద్దయ్య, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.అర్జున్‌రావు ఉన్నారు.

మాజీ సీఎం జగన్‌ను కలసిన శైలజ



జగన్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న జెడ్పీటీసీ మట్టా శైలజ

రాజోలు: రాజోలు జెడ్పీటీసీ మట్టా శైలజ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. శుక్రవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలంలో ఈ మేరకు కలిసి పుష్పగుచ్ఛం అందించారు. జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ బలోపేతం దిశగా కృషి చేయాలని సూచించినట్లు శైలజ తెలిపారు. పార్టీ అన్ని విభాగాలను సన్నద్ధం చేయాలని సూచించారన్నారు.

ఉచిత న్యాయ సేవలు అందిస్తా



మట్టా రాంబాబు

మలికిపురం: సమాజంలో పేదలకు ఉచిత న్యాయ సేవలు అందిచేందుకే లా సెట్‌లో రాణించినట్లు లాసెట్ 2486 ర్యాంకర్ మట్టా రాంబాబు పేర్కొన్నారు. మలికిపురం మండలం గుబ్బలపాలెం గ్రామానికి చెందిన దిలార్డ్స్ ప్రేయర్ హౌస్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడయిన రాంబాబు ఇటీవల పద్మావతి లా యూనివర్శిటీ విడుదల చేసి లాసెట్ ఫలితాలలో 2486వ ర్యాంకు సాధించారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఇప్పటికే పేదల కోసం సేవలు అందిస్తున్నానని అయితే గ్రామాల్లో అనేక మంది పేదలు ఉచిత న్యాయం అందక ఇబ్బందులు పడుతున్నారని ఇందుకోసం లా చేశానని చెప్పారు.

పారిశుధ్య చర్యలతో దోమల నిర్మూలన

ఆలమూరు: గ్రామీణ ప్రాంతాల్లో సంపూర్ణ పారిశుధ్యం నెలకొల్పడం ద్వారా దోమల నిర్మూలన జరిగి అంటువ్యాధులు వ్యాప్తి చెందవని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎస్.లక్ష్మీస్నేహ, బి.అనంత రామకృష్ణ, డి.సాయికిషోర్ కోరారు. డ్రైడే ఫ్రైడే సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఆరోగ్య, ఆశ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఇంట్లో నిల్వ నీరు ఉండకుండా తీసుకోవలసిన చర్యలను వివరించారు. రుబ్బురోళ్లు, కొబ్బరి చిప్పలు, ఖాళీ సీసాలు, వ్యర్థాలను ఇంట్లో ఉండకుండా చూడాలని మహిళలకు సూచించారు. దీనివల్ల క్రిమి, కీటకాలు దరి చేరవని, తద్వారా అంటు వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉండదన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించి మెరుగైన ఆరోగ్యకర సమాజాన్ని నెలకొల్పాలని ప్రజలను కోరారు. ఈసందర్భంగా వివిధ గ్రామాల్లో ఆరోగ్య, ఆశ సిబ్బంది ఫ్రై డేను వివరిస్తూ భారీ ర్యాలీలు నిర్వహించారు. సీహెచ్‌ఓ ఎంఎస్ఎన్ రెడ్డి, ఎంపీహెచ్‌ఈఓ కె.జ్యోతి కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్.బాలమణి వైద్యసేవలను పర్యవేక్షించారు.

కవి ధర్మోజీ సేవలు చిరస్మరణీయం



ధర్మోజీరావు పురస్కారాలు అందుకున్న ప్రముఖులు

రాజోలు: గుర్రం ధర్మోజీరావు సేవలు చిరస్మరణీయమని ప్రముఖ కవి ఇసుకపట్ల రఘుబాబు అన్నారు. శుక్రవారం స్థానిక అంబేడ్కర్ కమ్యూనిటీ హాలులో మండల ఉపాధ్యక్షుడు పొలమూరి శ్యాం బాబు అధ్యక్షతన జరిగిన ధర్మోజీరావు ఎనిమిదో సంస్మరణ సభ నిర్వహించారు. వివిధ రంగాల్లో సేవలు అందించిన డాక్టర్ కోలాటి పెద్దిరాజు, గెడ్డం పేర్రాజు, దేవ రాజేంద్రప్రసాద్, చింతా వెంకటరత్నం, గారదాడ రవిచంద్ర, యడ్ల నాగేశ్వరరావు, నూకల పెద్దిరాజులను ధర్మోజీరావు స్మారక పురస్కారలను అందజేసి ఘనంగా సత్కరించారు. తొలత డాక్టర బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి, ధర్మోజీరావు చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కవి రఘుబాబు మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో ధర్మోజీరావు రచనలను ఆధునిక కవులకు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. జేఏసీ అధ్యక్షుడు మట్టా సురేష్, నాయకులు లిఖితపూడి బుజ్జి, మందపాటి మధు, మోకా సురేష్, కొల్లాబత్తుల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

12 లీటర్ల సారాతో ముగ్గురి అరెస్ట్

కొత్తపేట: స్థానిక ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సర్కిల్ పరిధిలో 12 లీటర్ల సారాతో ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు సీఐ కె.కాత్యాయని తెలిపారు. ఎక్సైజ్ దాడుల్లో భాగంగా ఆత్రేయపురం మండలం ఉచ్చిలి గ్రామానికి చెందిన ఉర్రింకల దుర్గను 5 లీటర్ల సారాతో, వెలిచేరు గ్రామానికి చెందిన నిచ్చెనకోల్ల నాగమణిని 2 లీటర్ల సారాతో, అత్తిలి ఊదలయ్యని 5 లీటర్ల సారాతో అరెస్టు చేసి, కేసు నమోదు చేసినట్టు తెలిపారు. వారిని కొత్తపేట కోర్టులో హాజరుపర్చగా 14 రోజులు రిమాండ్ విధించినట్టు సీఐ తెలిపారు. ఈ దాడుల్లో సీఐ కేఎస్ చంద్రశేఖర్, ఎస్సై కె.అన్నవరం, ఎ.రవితేజ, కె.తమ్మారావు, సిబ్బంది పాల్గొన్నారు.